విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

మంగళవారం 16, జులై 2024 | 8 పేజీలు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం పొడిగింపు: కలెక్టర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ 12.07.2024న జీవో యం.యస్ నెం. 82 ను జారీ చేసినట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారని... ఈ మేరకు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ.2 లక్షల వరకు విలువ చేసే వైద్యసేవలు అందుతాయని, ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదే విధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఓపీ సేవలు పొందవచ్చని ఆయన వివరించారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియో గించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సీఎఫ్ఎంఎస్ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ అనే వెబ్ సైట్ ద్వారా ఈ క్రింద -3లో

చట్ట పరిధిలోని సమస్యలను

పరిష్కరించాలి

- జిల్లా అదనపు ఎస్పీ విబి రాజ్‌కమల్

విశాలాంధ్ర-రాయచోటి : అన్నమయ్య జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పోలీస్ అధికారులు న్యాయబద్ధంగా చట్ట పరిధిలో ఉన్న వాటిని సత్వరం పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ విబి రాజ్‌కమల్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి వారి సమస్యలను వినతి పత్రాల రూపంలో తీసుకొన్నారు. ప్రతి అర్జీ దారునితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు కూలంకషంగా విని సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రజల మన్ననలను పొందాలని పోలీస్ అధికారులకు ఆయన సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 58 ఫిర్యాదులు వచ్చాయి.

పొదుపు సంఘాలను..

చిదిమేస్తున్న ఆర్‌పీలు!

లోను ఇప్పించాలంటే పర్సెంటేజీ- ఇతరత్రా వాటికి కూడా వదలని చేతివాటం
స్పందనలో ఫిర్యాదుకు నిర్ణయం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మహిళలు ఆర్థికంగా ఎదగాలనే సదుద్దేశ్యంతో గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొదుపు సంఘాలు నేడు ఆర్‌పీల చేతుల్లో నలిగిపోతున్నాయి. ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం ఎన్ని పథకాలను ప్రవేశపెట్టినా అది ఆర్‌పీల పాలిట వరాలుగా మారాయనే చెప్పాలి. పొదుపు సంఘాల మహిళా సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరైన సమయంలో కమీషన్ల కోసం కొందరు మెప్మా సిబ్బంది కక్కుర్తి పడుతున్న వైనాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎర్రగుంట్ల పురపాలిక కావడంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులు పొదుపు సంఘాల కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటారు. మెప్మాలో ఒకరు టౌన్‌మిషన్ కోఆర్డినేటర్ (టీఎంసీ) ఇరువురు సీఓలు మరో 23 మంది ఆర్‌పీలు పొదుపు సంఘాల వ్యవహారాలను చక్కబెడుతుంటారు. పట్టణ పరిధిలో 637 వరకు పొదుపు సంఘాలు ఉన్నాయి. సహజంగా పొదుపు సంఘాల సభ్యులకు రుణాలు మంజూరైన సమయంలో పది మందితో కూడిన సంఘం నుంచి ఒక్కో సభ్యురాలు వద్ద నుండి రూ.200 లు వసూలు చేయడం సాంప్రదాయంగా మారింది. గతంలో రూ.120 అనంతరం రూ.150గా ఉండేది. తాజాగా ఇది రూ.200లకు చేరింది. ఆన్‌లైన్‌కు ఒకరేటు, తంబు వేయడానికి ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతిదాని కి డబ్బులు వసూలు చేయడంతో డబ్బులు వసూలు చేయడంతో చాలా పొదుపు సంఘాలు ఇబ్బందులు పడుతున్నాయి. అడిగిన డబ్బులు ఇస్తే లోను వెంటనే అయిపోతుంది. అలా కాకుండా బేరసారాలు చేసినా, మీకు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించినా బ్యాంకులో లోను రావాలంటే కొండను తవ్వి ఎలుకను పట్టినంత పని అవుతుంది. మహిళా సంక్షేమాన్ని కోరుతూ ఆర్‌పీలను నియమించారు. వీరు మాత్రం వారి సంక్షేమం కోసం ఆలోచిస్తూ మహిళా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు -3లో

కలగానే మిగిలిన 30 పడకల ఆసుపత్రి..!

తాయిలాలకే పరిమితమైన హామీలు- ఎన్నికల సమయంలో అభివృద్ధి పాట-తర్వాత శూన్యం
- సరైన వైద్యం అందక ప్రజలకు ఇక్కట్లు

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం ఓ మారుమూల ప్రాంతం సుమారు లక్షకు పైగా జనాభా కలిగిన ఉన్నా మండలంలో సరైన వైద్యం అందక నిరుపేద కుటుంబాలు వేల రూపాయలు వెచ్చించి ప్రైవేటు వైద్యం పొందాల్సిన దయనీయ పరిస్థితి ఈ మండలంలో దాపరించింది. ఓవైపు మెడికల్ మాఫియా ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నారు. 15 గ్రామపంచాయతీలలో 261 పల్లెల నుండి ప్రజలు నిరంతరం మండల కేంద్రానికి పలు రోగాలతో వచ్చే పరిస్థితి ఉన్నా ప్రభుత్వ వైద్యం రోగులకు అందని ద్రాక్షలా మారిందని మండల ప్రజలు లబోదిబోమంటున్నారు. 2014 ఎన్నికల అనంతరం మండలం లోని పలువురు మండల నాయకులతో కలిసి ప్రభుత్వ వైద్యశాలలో సమావేశాలు నిర్వహించిన ప్రతిసారి ఓట్లు కోసం ప్రజా ప్రతినిధులు శాలువాలతో సన్మానాలు చేయించుకొని కేవలం ఓట్లు దండుకునేందుకు మాత్రమే ప్రజలకు ఉచిత హామీలు కురిపించి కల్లు బొల్లి కబుర్లు చెప్పి ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు అయింది రాజకీయ నాయకుల పరిస్థితి ఎన్నికల సమయంలో అభివృద్ధి పాట గెలిచిన తర్వాత అభివృద్ధి శూన్యం ఇది ఇలా ఉంటే 30 పడకల ఆసుపత్రి మండల ప్రజలకు కలగానే -5లో

వేతనాల కొరకు కలెక్టరేట్ ఎదుట

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు ధర్నా

-5లో

కండక్టరు రాముడికి ఘన నివాళి

విశాలాంధ్ర - జమ్మలమడుగు : జమ్మలమడుగు ఏపీ ఎస్ ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టరు రాముడికి ఘనంగా నివాళులు అర్పించి నట్లు జమ్మలమడుగు డిపో మేనేజర్ పి.వి.ప్రవీణ్ తెలిపారు. సోమ వారం జమ్మలమడుగు మండలంలోని మొరుగుడి గ్రామంలోని రాముడు స్వగృహం నందు రాముడు పార్థివదేహానికి ప్రజా రవాణా సంస్థ కడప జోనల్ కార్యాన్ని నిర్వహణ అధికారి గిడుగు వెంకటేశ్వ రరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్ రెడ్డి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం బస్సు ప్రమాదానికి గురైన సంఘటనలో కండక్టరు రాముడు తనువు సాధించారని అన్నారు. విధి నిర్వహణలో తను చాలించిన కండక్టర్ రాముడు కుటుంబాని వారు ఓదార్చారు. అలాగే ఏపీఎస్ఆర్టీసీ సమస్త తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

కడప స్టీల్ ప్లాంట్ నిర్మించాలి

విశాలాంధ్ర - జమ్మలమడుగు : కడప స్టీల్ ప్లాంట్ ను ఎన్డీఏ కూట మి ప్రభుత్వం నిర్మించాలని ఆర్ విపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కెసి పాములేటి పేర్కొన్నారు. సోమవారం జమ్మలమడుగులో జరిగిన ఆర్ విపిఎస్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పాములేటి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి తరతరాలుగా అన్యాయం జరుగుతూ వస్తుందని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా శ్రీ బాగ్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాయలసీమ ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షం లో రాయలసీమ ప్రాంత ప్రజల తో కలిసి ఉద్యమం చేస్తామని అన్నారు. ఆగస్టు 4 5 తేదీలలో జరిగే ఆర్ విపిఎస్ రాష్ట్ర మహాసభల ను జయప్రదం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, గుంటయ్య ,రవితేజ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

విశాలాంధ్ర - వల్లూరు : శ్రీశ్రీశ్రీ విజయ కనక దుర్గా దేవి ఆలయం నందు శ్రీ భాగవత సప్త హ చివరి రోజున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గడికోట సుబ్బారెడ్డి తెలిపారు. అక్కింతల ఓబాయపల్లి మెయిన్ రోడ్డు శ్రీశ్రీశ్రీ విజయ కనకదుర్గ దేవి ఆలయం నందు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆషాడ మాసం శుద్ధ చవితి తొమ్మిదవ తేదీ మంగళ వారం నుండి పదవ తేదీ సోమవారం వరకు శ్రీ వినాయక దుర్గాదేవి ఆలయం నందు శ్రీ భాగవతం, శ్రీ వన పారాయణం దిగ్విజయముగా నిర్వహిం చారు. ఉదయం 5 గంటల నుంచి గణపతి పూజ భగవద్గీత పారా యణం, శ్రీ విజయ కనకదుర్గా దేవి, శివుడు ,శ్రీ వెంకట నాద కాల చక్ర ,విశ్వరూపము శీల క్షేత్ర మాత పంచముఖ ఆంజనేయ స్వామి, శనేశ్వర స్వామి మూర్తులకు పంచామృత అభిషేక పాదశోప చార పూజ నిర్వహించారు. అనంతరం అక్కింతల ఓబాయ పల్లిలో ఊరేగిం పు నిర్వహించారు.కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొని,తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

తాగునీటి సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే



విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు మున్సిపాలి టీ 16వ వార్డులో త్రాగు నీటి సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే పుట్టా సుధా కర్ యాదవ్ త్రాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మునిసి పల్ అధికారులకు ఆదేశించారు.స్థానిక టీడీపీ నాయకుడు యాపరా ల చిన్న ఆధ్వర్యంలో త్రాగు నీటి మోటార్ ను రిపేర్ చేసిన మున్సి పాలి టీ సిబ్బంది. కేవలం కొన్ని గంటల్లోనే సమస్య పట్ల స్పందించి పరిష్కరించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

అలంకారప్రాయంగా రైతు బజార్

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లె పంచాయతీ పరిధిలో ఆర్అండ్‌బి బంగ్లా చెంతన ఉన్న రైతు బజార్ అలంకార ప్రాయంగా ఉంది. ఇక్కడ సుమారు రూ.20లక్షలు వెచ్చించ 21గదులు, 43 కౌంటర్లతో రైతు బజారును ఏర్పాటు చేశారు. కానీ ఇంత వరకు ఇది వినియోగంలోకి రాలేదు. పేరుకే రైతు బజారు అని ఇంత వరకు ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరుగలేదన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించిన ఈ రైతు బజారు నిరుపయోగంగా ఉండిపోవడం చర్చనీయాంశమైంది. దీని వల్ల లక్షాదిరూపాయల వృథాగా మిగిలాయి. గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు ఉన్నాయి. వివిధ కార్యా లయాలకు ప్రభుత్వం నూతన భవనాలను నిర్మిస్తోం ది. తాజాగా రైతు బజారు ఎలాగూ ఉపయోగపడ లేదు. ప్రస్తుతం మార్కెట్‌ను మార్చాలన్న అంశం తెరపైకి వస్తోంది. ప్రస్తుతం నడుస్తున్న కూరగాయల మార్కెట్ పరిస్థితి అధ్వానంగా ఉంది. వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల ల్లో చక్కటి మార్గం లభించింది. నిరుపయోగంగా ఉన్న రైతు బజారులోకి కూరగాయల మార్కెట్‌ను తరలిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తవ ఎవుతోంది. కూరగాయల మార్కెట్‌గా ఉపయోగిస్తే రైతు బజారుకు మోక్షం లభిస్తుందనే వాదన కూడా వినవస్తోంఇ. ఈ విషయంలో అధికారులు స్పందించి కూరగాయల మార్కెట్‌ను నిరుపయోగంగా ఉన్న రైతు బజారులోకి మార్చు చేయాలని, ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపాలయని స్థానికులు కోరుతున్నారు.

దేశంలో ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు సరికాదు

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్ : రాజ్యాంగం వచ్చి 75 సంవ త్సరాలైనను ఇం కనూ దళితుల పైన దాడులు జరుగు తూనే ఉన్నాయనీ జఫన్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్, టిడిపి నాయకులు పందిటి డేవిడ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ. అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం పెన్నా పేరూరు గ్రామము ఎస్సీ మాల కులానికి చెందిన కదిరి ప్రభాకర్ అనే.55 సంవత్సరాల వయసు గల వ్యక్తి పై రెడ్డికులానికి చెందిన వారి ఇంటి అరుగుపైన కూర్చున్నాడని కుల దుహంకారముతో వేడి నూనె పోసిన గజ్జల వెంకట సుబ్బారెడ్డి అనేవ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీల రక్షణ కొరకు ఎన్ని చట్టాలు తెచ్చినా కూడా ఇంకా దళితుల పైన దాడులు జరుగుతూనే ఉన్నాయనీ అరుగుపైన కూర్చున్నాడని అతడిని కులం పేరుతో దూషించి వేడి నూనె పోయడం చాలా దుర్మార్గమని వెంటనే అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భాధితునికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. గద్దం శ్రీనివాసులు, చిన్న, పాల్గొన్నారు.

ఉప్పరపల్లిలో కట్టడాలు నిలిపివేత

వీఆర్వో ప్రభాకర్ రెడ్డి

విశాలాంధ్ర-సిద్దవటం : ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలో పుట్టగొడుగుల విస్తరిస్తున్న కట్టడాలను సోమవారం నిలిపివేశామని వీఆర్వో ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ శేఖర్ రాజు పల్లి రెవిన్యూ ఉప్పరపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 425/1 కట్టడాలు కడుతున్నట్లు మాకు సమా చారం వచ్చిందని పై అధికారుల ఆదేశాలతో నిర్మాణాలు నిలుపుదల చేశామని కట్టడాలకు సంబంధించిన పత్రాలు మండల తాసిల్దార్ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించా మని అన్నారు.

దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర -బద్వేలు : కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామంలో దళిత కులానికి చెందిన కదిరి ప్రభాకరపై నూనె పోసి గాయపరిచిన గజ్జల వెంకటసుబ్బా రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాడు వారు విలేకరులతో మాట్లాడుతూ దళితుడైన కదిరి ప్రభాకర్ పక్క గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా నీరసపడి కళ్ళు తిరిగి పడే నేపథ్యంలో పెన్న పేరూరు లో ఉన్న బండ పైన సొమ్మసిల్లి పడిపోవడంతో ఆ బండ అగ్రకులస్తులైనందున దళి తుడు అయిన నువ్వు మా అరుగు మీదనే కూర్చుం టావా అని బండబూతులు తిడుతూ అతని కొట్టడం జరిగిందని అన్నారు. అనవసరంగా కొడుతున్నావు ఏమని ప్రశ్నించిన అతనిపై నూనె పోసి గాయపర చడం సభ్య సమాజం తలదించుకునే విధంగా ప్రవ ర్తించడం అగ్రకుల అహంకారానికి పరాకాష్టని అన్నా రు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటుతున్న నేటికీ అనేక గ్రామాల్లో అగ్రకుల పెత్తందారీ వ్యవ స్థ నడుస్తుందని అన్నారు. అంటరానితనం సమస్య పోలే దని ఇప్పటికైనా అధి కారులు ఇటువంటి దుశ్చర్య లకు పాల్పపడ్డ అతన్ని వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వారు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ కుల అహంకారంతో దళితుల పైన దాడులు అత్యాచారాలు జరుగుతున్నా యని వాటిపైన చర్యలు తీసుకోవడంలో ఏ ప్రభుత్వం వచ్చిన విఫలమగుతు న్నాయని అన్నారు. ఇప్పటికైనా ఇటువంటివి జరగకుండా వెంటనే చర్యలు చేపట్టి వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపాటి పిచ్చయ్య దళిత సంఘం సీనియర్ నాయకుడు బత్తల కూరి కేశవయ్య, మునయ్య తదితరు పాల్గొన్నారు.

మైదుకూరులో జిల్లా స్థాయి జంప్ రోప్ పోటీలు

విశాలాంధ్ర - మైదుకూరు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్.మైదుకూరు లో జిల్లా స్థాయి జంప్ రోప్ పోటీలు జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేధా డిఫెన్స్ అకాడమీ చైర్మన్ చెన్నంశెట్టి నరసింహులు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసాన్ని కలిగిస్తాయని, విద్యార్థులు రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో రాణించాలన్నారు.పాఠశాల హెడ్మాస్టర్ గోశెట్టి రామమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో పాల్గొని క్రీడల్లో శారీరక ధృఢత్వాన్ని పెంపొందించు కోవాలన్నారు.తదనంతరం రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులను అభినందించి, కార్యక్రమం ముఖ్య అతిథిగా విచ్చేసిన చెన్నం శెట్టి నరసింహులు ను శాలువా,పూల మాల తో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జంప్ రోప్ స్టేట్ సెక్రటరీ అనిల్, పిడీలు నాయక్,ప్రసాద్, నాగార్జున, పుష్పలత, చంద్రావతి, వినోనియరాణి, పాఠశాల ఉపాధ్యాయులు ఎల్.సూర్య నారాయణ రెడ్డి, మీసాల మూనెయ్య, ఏ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ జ్వరాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో సోమవారం డెంగ్యూ జ్వరాల నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆ మేరకు స్థానిక లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థులు సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో రాష్ట్రంలో డెంగ్యూ ప్రభావం తీవ్రస్థాయికి చేరుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ముందు జాగ్రత్తలు చేపట్టింది. ఈ క్రమంలో పెద్దరంగాపురం గ్రామంలో మురుగు కాల్వల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. పరిశుభ్రత ఎక్కడ ఉంటే అక్కడ ఆరోగ్యం ఉంటుందన్న విషయాన్ని విద్యార్థులు గ్రామస్తులకు తెలియజేశారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కూడా ప్రాముఖ్యతనివ్వాలని విద్యార్థులు వివరించారు. ఇప్పుడిప్పుడే వర్షాలు కూడా మొదలయ్యాయని, దీని వర్షపు నీరు నిల్వ ఉండే అవకాశం ఉందని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలల్లో దోమలు సంతానోత్పత్తి చెందు తాయన్న విషయాన్ని వారు గ్రామస్తులకు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన విద్యార్థులకు గ్రామ నివాసి విరామకేశల సహాయ సహకారాలను అందించి వారిని ప్రోత్సహించారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక

కండువాలతో స్వాగతించిన సురేష్‌నాయుడు

విశాలాంధ్ర- యర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామం లో సోమవారం సుమారు 40 కుటుంబాలు అధికార టీడీపీలో చేరాయి. ఇప్పటి వరకు వైసీపీ పక్షాన పనిచేసిన వీరు నేడు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేష్‌నాయుడు సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నారు. పాత, కొత్త కలబోతతో ఈ ప్రాంత అభివృద్ధికి వీరి సహకారం తీసుకుంటానని సురేష్ నాయుడు స్పష్టం చేశారు. పాత వారితో సమానంగా నూతనంగా పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం లభిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారు కంచెరెడ్డి రామకృష్ణారెడ్డి (కిట్టయ్య) తో పాటు సుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, గంగిరెడ్డి, పెద్దిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జంగా బాలిరెడ్డి, కంచెరెడ్డి శివరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చల్లా సుధాకర్‌రెడ్డి, పడిగపాటి శివారెడ్డి, మాలెపాటి జయరామిరెడ్డి ఉన్నారు.

..చిదిమేస్తున్న ఆర్‌పీలు!

(మొదటి పేజీ తరువాయి) వినిపిస్తున్నాయి. ఓ వైపు ప్రతినెలా జీతాలు పుచ్చుకుంటూ అదనంగా కమీషన్ల కోసం కక్కుర్తి పడడం ఏ మేరకు సబబో సదరు సిబ్బంది ఆత్మవిమర్శ చేసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం ఓ వైపు అవినీతికి ఆస్కారం లేకుండా అధికారులు, సిబ్బంది వ్యవహారం చాలని పదేపదే చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇలా జరుగుతుండడం శోచనీయం.

కమీషనర్‌కు కూటమి నేతల ఫిర్యాదు: డ్వాక్రా సభ్యులను దోచుకుంటున్న వైనంపై సోమవారం స్థానిక బీజేపీ, టీడీపీ నాయకులు మున్సిపల్ కమీషనర్ రామకృష్ణకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.

ఆర్‌పీల దోపిడీపై వెంటనే విచారణ జరిపి దోపిడీని నివారించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ అంశంపై సోమవారం కడప కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి కూడా ఫిర్యా దు చేయాలని వారు భావిస్తున్నట్లు సమా చారం. కమీషనర్‌ను కలిసిన వారిలో కె.ప్రకా శం, సత్యంస్వామి, పి.రాజశేఖర్, కె.జయ ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

..గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి) తెలిపిన పద్దుకు రూ.1250 లు చెల్లించి 31.03.2025 వరకు లబ్ధి పొందవలసిందిగా తెలపడమైనది.

ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు జత చేయవలసిన కాపీలు: 1.ఒరిజనల్ చలానా 2.అక్రిడిటేషన్ జిరాక్సు 3. హెల్త్ స్కీమ్ దరఖాస్తు 4. కుటుంబ సభ్యుల ఫోటోలు, ఆధార్ కార్డుల కాపీలను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో పనివేళల్లో అందజేయాల్సిందిగా కోరడమైనది. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

హాకీ క్రీడాకారులకు సన్మానం

విశాలాంధ్ర- పులివెందుల: స్థానిక ధ్యాన్‌చంద్ క్రీడామైదానంలో సీనియర్ హాకీ క్రీడాకారులను (50మంది) సన్మానించారు. ఈ నెల 10వ తేదీన దక్షిణభారత జాతీయస్థాయి హాకీ పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ టోర్నమెంటు సందర్భంగా స్థానిక ధ్యాన్ చంద్ క్రీడామైదానంలో వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కడప హాకీ అసోసియేషన్ వారు జిల్లా ప్రెసిడెంట్ రవిచంద్ర, జిల్లా సెక్రెటరీ శేఖర్ సీనియర్ అండ్ ఎక్స్ కడప హాకీ ప్రెసిడెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏపి కేబినెట్ బోగస్ సర్టిఫికేట్లు ఏరివేతకు తీర్మానించాలి

ఏపీ డియస్సి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి డిమాండ్

విశాలాంధ్ర -కడప : మంగళవారం జరిగే ఏపి కేబినెట్ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖలోని మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ బోగస్ సర్టిఫికేట్లు ఏరివేతకు తీర్మానించాలని,హైకోర్టు కోర్టులో ధిక్కారణ కేసులు పెట్టిన బోగస్ సర్టిఫికేట్ దారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, నిజాయితీయైన అధికారు లకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలబడాలని, దీర్ఘకాలికంగా కొనసాగుతున్న 2002 నోటిఫికేషన్ను ముగింపు పలకడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఏపీ డియస్సి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.బోగస్ సర్టిఫికేట్లు సత్వరం ఏరివేయాలని, అదే సమయంలో జెన్యూన్ సర్టిఫికేట్ దారులను రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు.అదే విధంగా వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు అక్రమ ధనార్జనే లక్ష్యంగా పనిచేస్తున్న అవినీతి అధికారుల బారినుండి నిజాయితీయైన అధికారులను కాపాడాలని ఆయన కోరారు. బోగస్ సర్టిఫికేట్ దారులకు డియస్సిలో అక్రమ మార్కులు అధికంగా పొంది మెరిట్ పేరుతో ఉద్యోగాలు పొందుతున్న ప్రక్రియ పట్ల ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే ఈనాటి ఈపరిస్థితి ఏర్పడిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇదే 2002 రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ ద్వారా వివిధ క్యాడర్లలను భర్తీ చేసినప్పటికీ , వాటిన్నిటికి ఒకే సారి హేతుబద్ధమైన ముగింపు పలికారని, అయితే నేటికీ 22 సంవత్సరాల కాలం గడిచినప్పటికి,ఆదే నోటిఫికేషన్ ను కొనసాగించడం, హెల్త్ అసిస్టెంట్ క్యాడర్‌ను మాత్రం బోగస్ సర్టిఫికేట్లు మాఫియా సూచనలతో ప్రతి దశలో న్యాయస్థానాలకు తప్పుడు కృషిసమాచారంతో తప్పుదారి పట్టించి బారి యెత్తున వ్యాపారం కొనసాగిస్తూన్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు బోగస్ సంస్థల బోగస్ సర్టిఫికేట్లు గురించి ఉన్న నిజాలను నిర్భయంగా హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి కోర్టుకు పిటనర్ల రూపంలో ఉన్నవారి బోగస్ సర్టిఫికేట్ ఏరివేయడానికి ముమ్మరంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.గత మూడు దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్న ,ప్రభుత్వ శిక్షణ సంస్థల నందు హెల్త్ అసిస్టెంట్లుగా శిక్షణ పొందిన వారికి త్వరితగతిన రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే ప్రైవేట్ శిక్షణ సంస్థల సర్టిఫికేట్లు బోగస్ ని తేల్చి చెప్పిన విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ రిపోర్ట్ పరిగణలోనికి తీసుకొని వెంటనే ముమ్మరంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఏపి రెగ్యులరైజేషన్ ఆఫ్ సర్వీసెస్ ఆఫ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ఆక్ట్ 2023 ద్వారా 10,117 మందిలో 3,300 రెగ్యులర్ కాగా మిగిలిన ఉన్న కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, యన్.యం.ఆర్ ఉద్యోగుల అందరిని రెగ్యులర్ చేసి, ఆ ఉద్యోగ నియామక విధానాన్ని రద్దు చేసి రెగ్యులర్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న పోస్టులన్నిటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్డీఏ కూటమి ఎన్నికల మేనిఫెస్టో 2024 హామీ మేరకు కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కన్సాలిడేటెడ్ లాంటి తక్కువ జీతం పొందుతున్న కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా పొందే లబ్ధిని వర్తింపజేస్తూ జీవోను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

విశాలాంధ్ర - సుండుపల్లె : పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు పర్యవరణాన్ని పరిరక్షించడం కోసం ప్రతి ఒక్కరూ ఒక్కో చెట్టును నాటి పర్యవరణ పరిరక్షణ కోసం పాటు పడాలని తెలుగుదేశం పార్టీ రాజం పేట నియోజకవర్గ ఇంచార్జ్ పేర్కొ న్నారు. మండల కేంద్రానికి సమీపం లోని గాండ్లపల్లి దగ్గర గురుకుల పాఠశాలలో చెట్లు నాటే కార్యక్రమాన్ని మండల ఎంపీపీ రాజమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ మన పరిసరాలను మనమే కాపాడుకోవాలని రోజు రోజుకు వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి.దానిలో భాగంగా గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ లాంటివి పడకుండా, ఓజోన్ పొర దెబ్బతిన కుండా ఉండాలంటే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి జీవికి ప్రాణ వాయువు ఆక్సిజన్ ఎం తో ముఖ్య మని దాన్ని కలుషితం కాకుండా ప్రతి పౌరుడు కాపాడు కోవా ల్సిన బాధ్యత అంద రిపై నా ఉందిని.ప్రతి ఇంటి ముందు చెట్లు నాటి పర్య వరణ పరిరక్షణకు భావితరాల సంరక్షణకు దోహద పడాల న్నా రు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్ర నాయ క్, ప్రిన్సిపల్ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కళ్లే రెడ్డప్ప, మంత్రి శివారెడ్డి,శివ కుమార్ నాయ డు, సురేష్ నాయుడు,సురేష్ నాయుడు,జనసేన వీర మహిళ రెడ్డి రాణి,బిజెపి రాజంపేట అసెంబ్లీ అధ్యక్షుడు జగదీశ్వర స్వామి,అశోక్,వెంకటయ్య, సురేష్ పాల్గొన్నారు.

రైతుల విద్యుత్ సమస్యలపై అధిక ప్రాధాన్యత

విశాలాంధ్ర - జమ్మలమడుగు : రైతు దేశానికి వెన్నముకలాం టివాడని అలాంటి రైతుల విద్యుత్ సమస్యలపై అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్. రమణ పేర్కొన్నారు. సోమవారం జమ్మల మడుగు సబ్ డివిజన్ పరిధిలోని జమ్మలమడుగు, ముద్దనూరు, మైలవరం, పెద్దముడియం, కొండాపు రం మండలాల విద్యుత్ శాఖ అధికారులతో మరియు సిబ్బందితో పతంగి ఫంక్షన్ హాల్ నందు సమావేశం నిర్వహించారు. జమ్మలమడుగు 33/11 కె.వి సబ్ స్టేషన్లు, ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ లైన్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి స్వయంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇష్టంతో పనిచేయాలని కష్టమనేది తెలియ కుండా అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చున్నారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రతా నియమాలు తప్పక పాటించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయని ఇకపై ఎటువంటి పరిస్థితులలో అంతరాయాలు పునరా వతం కాకుండా గట్టి చర్య లు తీసుకోవాలని అన్నారు. పనిచేయని విద్యుత్ శాఖ అధికారులపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలను తాకకుండా, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా మరమ్మతులను విద్యుత్ శాఖ సిబ్బందితో చేయించుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించేలా వార్తాపత్రికల ద్వారా ప్రజలకు అవగా హన కల్పించాలని అన్నారు. దీంతో విద్యుత్ ప్రమా దాలను అరికట్టవచ్చున్నారు. వినియోగదారుడు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలోని సిబ్బంది అధికారులు వారితో మమేకమై మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సాధించా లన్నారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజాగోపాల్, జమ్మలమడుగు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజాబాబు, ఇంజనీర్లు రామకృష్ణయ్య ,శ్రీనివాస వర్మ, ఓబులేసు, సీతాంబర రెడ్డి, జూనియర్ ఇంజనీర్లు విజయ్ బాబు, అకౌంట్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను దగా చేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - కమలాపురం : స్థానిక తహసిల్దార్ కార్యాలయం సమీపంలోని వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పి రవి రెడ్డి పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లికి వందనం' పథకం. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం దగా. అని మాజీ ఎమ్మెల్యే అన్నారు. మాజీ సీఎం జగన్ పై అక్రమ కేసు నమోదు దుర్మార్గం అని అన్నారు. ఏపీలో విష సంస్కృతి కి నాంది పలికితే పర్యవసానం చెల్లించక తప్పదుమాజీ ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆనాడు తెలుగుదేశం పార్టీ జాతీయ అధినేత నారా చంద్రబాబు నాయుడు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రచా రంలో మాట్లాడిన మాటలు రాష్ట్ర ప్రజలం దరికీ తెలుసన్న అయితే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా, ప్రతి ఒక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ఆర్భా టంగా, అట్టహాసంగా ప్రచారం చేసిన టీడీపీ కూటమి, అధికారంలోకి వచ్చాక, పథకం అమలులో మరోసారి రాష్ట్రంలోని తల్లిదండ్రు లను దగా చేసిందన్నారు ఇంట్లో ఒక్కో పిల్లాడిని చూపిస్తూ.. మా ప్రభుత్వం రాగానే.. ఇలా అందరికీ రూ.15 వేల చొప్పున ఎందరు పిల్లలు ఉంటే, అంత మందికి కలిపి మొత్తం.. రూ.45 వేలు, రూ.60 వేలు, రూ.75 వేలు ఇస్తామంటూ.. చంద్రబాబు మొదలు.. పార్టీ నాయకులు, కూటమిలో ఉన్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సైతం తల్లికి వందనం పథకంపై ఆర్భాటంగా ప్రచారం చేశారన్నా రు. టీడీపీ గొప్పగా చెప్పుకున్న 'సూపర్ సిక్స్'లో కూడా పథకాన్ని చూపారని తెలిపారు

ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు : జెసి

విశాలాంధ్ర-రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో అధికారులు జాప్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ పర్మన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేశారు. ఆర్జీలను స్వీకరించి ప్రజల సమస్యలను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. న్యాయపర మైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంబేపల్లి మండలం దుద్యాల గ్రామం కోడివాడ్లపల్లెకు చెందిన చిన్న రెడ్డమ్మ తనకు వితంతు పెన్షన్ వస్తుండగా ఇటీవల ఆపేసారని, మదనపల్లె మండ లం వేంపల్లి గ్రామం కోళ్లవారిపల్లె దళితవాడకు చెందిన యశోదమ్మ నా భర్త రోడ్డు ప్రమాదంలో మరణించారని తనకు ఎలాంటి జీవనాధారం లేదని ఏదైనా ఆర్థిక సహాయం మంజూరు చేయాలని, సుచిత్ర తనకు పక్కాగృహం మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సత్యనారాయణ ప్రజల అర్జీలను స్వీకరించారు.

నాణ్యమైన చికెన్ను వినియోగదారులకు అందించాలి

- మున్సిపల్ కమిషనర్ వాసు బాబు

విశాలాంధ్ర-రాయచోటి : రాయచోటి పట్టణంలో చికెన్ సెంటర్లు శుభ్రంగా ఉంచుకొని వినియోగదారులకు నాణ్యమైన చికెన్ అందించాలని మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, ఫుడ్ సేఫ్టీ అధికారులు చికెన్ సెంటర్ల యజమానులను ఆదేశించారు. పట్టణంలోని పలు చికెన్, మటన్ సెంటర్ల ను తనిఖీలు నిర్వహించారు. సెంటర్లలో నాణ్యమైన కోళు ఉన్నాయా లేవా పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేవా, ఫ్రిజ్జుల్లో కోడి మాంసం ఉందా తదితర అంశాలను పరిశీలించారు. నాణ్యత లేకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడద్దని, అలా చేస్తే అలాం టి సెంటర్ల యజమానుల మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. తనిఖీలలో మున్సి పల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది సీతారామయ్య, శివమల్‌రెడ్డి, శానిటరీ కార్యదర్శులు నాగర్జున, తరుణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ మజీద్‌కు వైవీయూ డాక్టరేట్

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగివేమన విశ్వ విద్యాలయం బిజినెస్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ పరిశోధకులు షేక్ అబ్దుల్ మజిద్ కు విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ బిజినెస్ మేనేజ్మెంట్ సహ ఆచార్యులు డాక్టర్ పి. సరిత పర్యవేక్షణలో " ఏ స్టడీ ఆన్ హ్యూమన్ రిసోర్స్ ప్రాక్టీసెస్ ఆఫ్ సెలెక్ట్ సోషల్ ఎంటర్ పెన్యూర్ షిప్ ఆర్గనైజేషన్ ఇన్ సదరన్ స్టేట్స్ ఆఫ్ ఇండియా "అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. ఈయన రాసిన పరిశోధన వ్యాసాలు పలు జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. బిజినెస్ మేనేజ్మెంట్ శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు డాక్టరేట్ పొందిన షేక్ అబ్దుల్ మజీద్ ను అభినందించారు.

కుష్టు వ్యాధి రహితంగా అన్నమయ్య జిల్లా

- జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్

విశాలాంధ్ర-రాయచోటి : అన్నమయ్య జిల్లాను కుష్టు వ్యాధి రహితంగా రూపొందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని సమావేశ హాలులో జేసీ అధ్యక్షతన కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించే జిల్లాస్థాయి సమన్వయ సమావేశం జరిగింది. జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో జూలై 18 నుంచి ఆగస్టు 2 వరకు కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా కుష్టు వ్యాధి అనుమానిత లక్షణాలు ఉన్న ఎడల ఇంటి వద్దకు ఆరోగ్య కార్యకర్తలు పరీక్ష చేయడానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా చూపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలేదా ఆరోగ్య కార్యకర్త వద్ద ఎండిటి మందులు ఉచితంగా లభిస్తాయన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపును పటిష్టంగా నిర్వహించాల న్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ కె. కొండయ్య మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా మొత్తము 1237 టీంలు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని వ్యాధి లక్షణాలు పరిశీలిస్తారన్నారు. ఈ సర్వే పరిశీలించడానికి 502 మంది సూపర్వైజర్లు నియమించారన్నారు. అనంతరం కుష్టు వ్యాధి ప్రచార పోస్టర్లను, పాంప్లెట్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని జేసి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సత్య నారాయణరావు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పారామెడికల్ అధికారి రవికుమార్, డిప్యూటీ పారామెడికల్ అధికారులు శంభు ప్రసాద్, వేణుగోపాల్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి తన జీవిత గమ్యాన్ని నిర్దేశించుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటి : ప్రస్తుత సమాజంలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థి తన జీవిత గమ్యాన్ని నిర్దేశించుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ విద్యార్థులను కోరారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి తన జీవిత గమ్యాన్ని నిర్దేశించుకోవాలని, గమ్యాన్ని చేరడానికి అంకిత భావం ,కృషి ,పట్టుదల ధనాత్మక ఆలోచన, ఒత్తిడిని జయించడం మరియు మంచి నడవడికతో అడుగులు వేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పాత్ర ఉద్యోగ అన్వేషణలో కీలకమని, భావవ్యక్తీకరణ, నైపుణ్య అభివృద్ధితో విషయాన్ని ఎదుటివారికి క్లుప్తంగా వివరణ ఇవ్వడం, ఆత్మన్యూనతా భావాన్ని తొలగించుకుని కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకుంటే విజయం మీ వెంటే ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇంటర్వ్యూ స్కిల్స్, తరచుగా ఇంటర్వ్యూ సమయంలో ఎదురయ్యే ప్రశ్నలు, వాటికి సమాధానాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లా డుతూ కళాశాలలో ఇంజ నీరింగ్ మరియు పాలి టెక్నిక్ విద్యార్థులకు మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్ ,అర్థమెటిక్ మరియు రీజనింగ్ అంశాలపై అందిస్తున్న ప్రత్యేక శిక్షణను కళాశాలలోని డిజిటల్ లైబ్రరీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను మెరుగు పరుచుకుని ఉన్నత స్థానాలు అందుకోవాలని సూచించారు. అనంతరం ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ, కస్టమర్ రిలేషన్ మేనేజ్మెంట్ వంటి అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ వివిధ విభాగాల అధిపతులు ,అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటీకి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థి

విశాలాంధ్ర - రామాపురం : 2024 25 విద్యా సంవత్సరానికి గాను ట్రిబుల్ ఐటీ లో కౌన్సిలింగ్లో రామవరం మోడల్ స్కూల్ విద్యార్థి భవాని శంకర్ సీటు సాధించినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తెలిపారు తమ పాఠశాలలో ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు చదివి 2024 మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 576 మార్కులు సాధించిన భవాని శంకర్ ట్రిబుల్ ఐటీ కౌన్సిల్లో సీటు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

భవన నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

విశాలాంధ్ర-రాయచోటి : రాజంపేట ఏరియాలో ఇసుక అందుబాటులోలేక నిర్మాణ రంగం మీద ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు నిర్మాణ పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు తక్షణమే స్పందించి రాజంపేట ఏరియాలో ఉచితంగా ఇసుకను అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ భవణ నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం రాజంపేట ఏరియాలో ఉచితంగా ఇసుకను అందించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ భవణ నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రాజంపేటకు ఇసుక రవాణా నిలుపుదల చేశారని, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుకను అందిస్తే నిర్మాణ పనులు ప్రారంభం అయి కార్మికులకు నిర్మాణ పనులు దొరుకుతాయని, కార్మికుల ఆశలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా అడియాశలుగా మారిపోయాయన్నారు. సిద్ధవటం నుంచి దాదాపు 50 కిలో మీటర్ల నుంచి ఇసుకను తెచ్చి ట్రాక్టర్ ఇసుకను 8000 వేలకు అమ్ముకుంటున్నారని ప్రస్తుతం అదికూడా లేకపోవడంతో కార్మికులకు నిర్మాణ పనులు లేక ఆకలి కేకలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి రాజంపేట ఏరియాలో ఉచితంగా ఇసుకను అందించి భవణ నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎస్ రాయుడు, కేశవా, నరసింహులు, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ రెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసులు, హుస్సేన్, రంగస్వామి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-రామాపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్స్ పథకమును సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లిమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరేవుల రమేష్ రెడ్డి అన్నారు రామాపురం మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల తప్ప ఎలాంటి కూలీలైన ఈ పథకానికి 18 నుండి 55 సంవత్సరాల లోపు వారు అందరూ అర్హులే అన్నారు 110 రూపాయలు చెల్లిస్తే ఐదు సంవత్సరాల వరకు చెల్లించాలని పని లేదన్నారు ఒక సంవత్సరం పాలసీ పొందిన తర్వాత పాలసీదారుడు ప్రమాదవశాత్తు 50% వికలాంగుడిగా మారితే 2:50 లక్షలు 100% వికలాంగుడైతే ఐదు లక్షలు పరిహారం పొందే అవకాశం ఉందన్నా రూ పాలసీదారుడు సహజ మరణం పొందితే 1,30,000 ప్రమాదవశాత్తు మరణిస్తే 6 లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందన్నారు వివరాలకు మండలంలో ఎంపీడీవో తాసిల్దార్ ను లేబర్ ఆఫీసర్ ను సంప్రదించి అందరూ లేబర్ ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు.

గ్యారెంటీ పింఛన్ స్కీం చట్టాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఉద్యోగుల మనోభావాలకు వ్యతిరేకంగా ఉన్న గ్యారెంటీ పింఛన్ స్కీమ్ గెజిట్ ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడపలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సిపిఎస్ రద్దు విషయం పరిశీలిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి గారు మరియు పవన్ కళ్యాణ్ గారు దాని గురించి పరిశీలించే లోపల అధికారులు గ్యారెంటీ పింఛన్ స్కీం అమలు పరిచే ఉత్తర్వులు ఇవ్వడం చాలా దారుణం అన్నారు. ప్రభుత్వము వెంటనే గ్యారెంటీ పింఛన్ ఉత్తర్వులను రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలకు కృషి చేయాలి అన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల తో ప్రభుత్వము సమావేశం ఏర్పాటు చేసి పాత పింఛన్ స్కీం అమలకు విధి విధానాలు రూపొందించాలన్నారు. ప్రభుత్వం స్పందించి పాత పింఛన్ అమలు పునరుద్ధరించే దిశగా అడుగులు వేస్తూ ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలలో ఆనందం కలిగించేలా చర్యలు చేపట్టానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తుపాకుల మురళి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవులశ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రామచంద్ర జిల్లా కార్యదర్శులు నాగరాజు,బి చంద్రశేఖర్, సలాం, శ్రీరామ్, ఎల్వి రవిశంకర్, పాల్గొన్నారు.

టంగుటూరు గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: కడప జిల్లా రాజుపాళెం మండలం లోని టంగుటూరు గ్రామ పంచాయతీ ప్రజల సమస్యలు పరిష్కరించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ గంజికుంట నాగరాజు ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులను కలిసి సమస్య లతో కూడిన అర్జిని అందించారు. ఈ సంధర్భంగా నాగరాజు మాట్లాడుతూ టంగుటూరు గ్రామం కొత్తకోట్టాల బీసీ కాలనీ నందు కాలనీ రోడ్లు లేకుండా ప్రజలు అనేక ఇబ్బందులకు గురౌతున్నారని చిన్న పిల్లలు సైతం బురద నీటిలోనే అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారని అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ ప్రజలు వాటర్ ట్యాంకులు లేక ఒకవైపు తాగునీటి సౌకర్యం, మరోవైపు సాగునీటి సౌకర్యం లేక అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, అలాగే టంగుటూరు గ్రామం నుండి కొట్టాల గ్రామానికి ఇంతకు మునుపు ఉన్న గ్రావెల్స్ రోడ్డును క్రమబద్ధీకరించి యదావిధిగా రాకపోకలు కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారుల కు, నాయకులకు విన్నవించుకున్న ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కావున తమరు తప్పక ఈ సమస్యలు పరిష్కరిం చాలని విన్నవించగా డిఆర్ఓ గారు సంబంధిత అధకిఆరులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక దగ్గరికి పిలిపించి తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందని నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు గ్రామ నివాసి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళిత గర్భిణీపై ఎస్సై ప్రతాపం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : దళిత మహిళ అని చూడ కుండా అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు ఎస్సై నాయక్ చిందులేసి అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ఇష్టం వచ్చినట్లు బూతులు మాట్లాడుతూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారనీ ఓబులవారిపల్లె మండలం, చిన్నఒరంపాడు నివాసి ధార్ల సారమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులాలు మాట్లాడారు. తన భర్త ఆనందబాబును కృష్ణా నగరకు చెందిన జంగిటిసుభద్ర ట్రాప్ చేసి, లక్ష రూపాయలు తీసుకొని మోసం చేయడం జరిగిందన్నారు. అప్పటి ఎస్సై మోహన్ గౌడ్ సుభద్రాలు కుమ్మక్కయి 15 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేసారన్నారు. వారి మాటలు విని వేధింపులు భరించలేక డబ్బులు చెల్లించామన్నారు. ఇటీవల కాలంలో ఎస్సై నాయక్ , కానిస్టేబుల్ ఆకెఫ్ లు తన ఇంటికి వచ్చి ప్రతిరోజు బెదిరిస్తున్నాడని బెదిరిస్తున్నారనీ, మీరు పెట్టిన కేసులను విత్ డ్రా చేసుకోమని డిమాండ్ చేశారన్నారు. తాను 8 నెలల గర్భవతి అనీ, నా భర్త మరియు నా కుమారుడు రంజిత్ కుమారులను చిత్ర హింసలకు గురి చేసారన్నారు. ఆ సమయంలో నేను స్టేషన్ కి వెళ్లి ప్రశ్నించగా మాల లంజా స్టేషనుకు వచ్చావా అంటూ సుభద్ర బంధువుల సమయంలో ఎస్ఐ నాయక్ నా కడుపు మీద బూటు కాళ్లతో తన్నడం జరిగిందన్నారు. వెంటనే తిరుపతి హాస్పిటల్ కి వెళితే గర్భంలో రక్తస్రావం జరిగిందని వైద్యులు పేర్కొన్నట్లు తెలిపారు. నీ కుటుంబాన్ని చంపితే నీకు దిక్కు ఎవరనీ, బెదిరించారని తెలిపారు. నా భర్తకు ప్రాణహాని ఉందనీ, నా కుటుంబాన్ని కాపాడాలని కోరారు. ఉమ్మడి కడప జిల్లా సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు చౌడవరం సుబ్బ నరసయ్య మాట్లాడుతూ ఎస్సై నాయక్ పై చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేసి హెూంమంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. సై నాయక్ గతంలో పనిచేసిన ప్రతి మండలంలో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. మండల నాయకులు కొరముట్ల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఎస్సై నాయక్ లాంటి చీడపురుగులు పోలీసు శాఖలో ఉండకూడదన్నారు. తగిన న్యాయం జరగకపోతే ఆత్మహత్యలే శరణమని ఆవేదన వ్యక్తం చేశారు.

కమిషనర్‌కు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వినతి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: 12-04-2007 జీఓ ఎంఎస్ నెంబర్ 227, జీఓఎంఎస్ నెంబర్ 1000565 లు 27-10-2018లో మేస్త్రీలుగా ప్రమోట్ చేయడానికి ప్రభుత్వం ఇచ్చిన జీవోల మేరకు పర్మినెంట్ పారిశుద్ధ్య కార్మికులను మేస్త్రీలుగా అలాగే వర్కింగ్ ఆర్గనైజింగ్ క్రింద ఆయా కమీషనర్లు నియమించారని, ఆ మేరకు నేటి వరకు కొనసాగిన వ్యవస్థ 1977లో వెయిటేజ్ ఇంక్రిమెంట్లను ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పోరాటి సాధించుకున్న తరుణంలో పారి శుద్ధ్య కార్మికులు చదువుకున్న వారికి సీనియర్టి ప్రతి పాదికన మేస్త్రీలుగా ప్రమోట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు బి.రామయ్య ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ నిర్మల, సహాయ కార్యదర్శి నాగమ్మ, సురేష్, నాగరాజు, గురుమూర్తి, డిప్యూటేషన్ మేస్త్రీలు ఓబులేసులు మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వంలో 1981, 1982నుంచి ఈ వ్యవస్థ ఉన్నదని, కొంతమంది వారి స్వార్ధం కోసం డిప్యుటేషన్లు రద్దు చేయమంటున్నారని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. 2011 జనాభా ప్రకారమే కార్మికులు ఉండటంతో కార్మికులపై పనిభారం పడుతున్నదని, కనుక మా రెగ్యులర్ కార్మికులు రిటైర్మెంట్ అయిన స్ధానంలో వారి కుటుంబ సభ్యులు డైలీ లెజ్ కింద తీసుకొని ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన పిదప ఔట్‌సోర్సింగ్‌లోనే వీరిని తీసుకోగలరని కోరుతున్నామ న్నారు. అలాగే పెండింగ్‌లో 4 మేస్త్రీ పోస్టులను, మూడు పర్మినెంట్ సీనియార్టి కార్మికులను భర్తీ చేయగలరని, అలాగే పెండింగ్‌లో ఉన్న యూనిఫాం, చెప్పులు, సబ్బులను కార్మికులకు అందజేయాలని కోరుతున్నామన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య అమలు వేగవంతం కావాలంటే పని విభజన జరగాలని, కాని సచివాలయాలకు కార్మికులను గత వైసిపి ప్రభుత్వం అనధికారంగా మళ్లించడం మూలంగానే పైన పేర్కొన్న సమస్యలు వస్తున్నాయి అన్నారు. కనుక కార్మికులకు విధుల్లో వుంచేందుకు డివిజన్ కార్యాలయం వద్దనే మస్టర్ లేక మానిటరింగ్ నిర్వహించాలని లేని పక్షంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆందోళనలకు సిద్ధపడుతాం అని తెలిపారు.

వేతనాల కొరకు క్రలెక్టరేట్ ఎదుట పకృతి వ్యవసాయ ఉద్యోగులు ధర్నా

విశాలాంధ్ర-రాయచోటి : అన్నమయ్య జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి 15 నెలలుగా జీతాలు అందకపోవడంతో జిల్లాలోని పకృతి వ్యవసాయ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట కదం తొక్కారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న అన్నమయ్య జిల్లాలోని 450 మంది ఉద్యోగులు సిఐటియు ఆధ్వర్యంలో డియంహెచ్ఓ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట భారీ మానవహారంతో పెండింగ్ వేతనాల కోసం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌరవేతనం లేక మా కుటుంబాల పోషణ, మా పిల్లల చదువులు,ఆరోగ్యం, మా కుటుంబ అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. జిల్లా అధికారులు, రాష్ట్ర అధికారుల దృష్టికి పలు దఫాలుగా మా సమస్యలు విన్నవించినప్పటికి గౌరవ వేతనాలు మేము వేయబోతున్నాము. అధైర్య పడవద్దు అని పదేపదే హామీ ఇస్తూ కాలయాపన చేస్తూ 15 నెలల గౌరవ వేతనాలు ఏపీ సిఎన్ఎఫ్ ప్రాజెక్టు వారు జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మధుకర్, సిద్దయ్యలు మాట్లాడుతూ పెద్ద ఎత్తున ధర్నాలు చేసిన ఫలితంగా కేవలం రెండు నెలలు మాత్రమే జీతాలు ఇచ్చి చేతులు దులుపుకున్నరన్నారు. ఒక్కొక్కరికి 5 నుండి 7 లక్షలు రావాల్సి ఉందని, చేసిన రుణాలకు వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇప్పటికైన మా 15నెలల బకాయి వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ పెండింగ్ జీతాల విడుదలకు అధికార యంత్రాంగంతో మాట్లాడి పరిష్కారం కొరకు కృషి చేస్తామని తెలిపారు. పెండింగ్ జీతాల కొరకు దశల వారి ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రవీంద్ర రామయ్య, వంశీ ధనశేఖర్, ఖాదర్‌బీ, పద్మజ, యస్‌వి నాగరాజు, రమణ, రామాంజులు, కృష్ణయ్య వెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె. నాగబసిరెడ్డి, ప్రకృతి ఉద్యోగులు పాల్గొన్నారు.

కలగానే మిగిలిన 30 పడకల ఆసుపత్రి..!

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిపోయింది సుం దుపల్లెలో నేడో.. రేపో.. 30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తామని చెప్పడం తప్ప హామీలను నెరవేర్చిన పాపాన పోలేదని మండల ప్రజలు వాపోతున్నారు.మళ్లీ 2019 ఎన్నికల సమయంలో ఎంపీ మిధున్ రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డిలు 30 పడకల ఆసుపత్రిని వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పిన మాటలు నేటికీ నీటిపై రాతల్లానే మిగిలాయి.వేలమంది శ్రేయస్సు కోసం 30 పడకల ఆసుపత్రిగా నవీకరణ చెయ్యాలని అలాగే ఆసుపత్రిలో కనీసం ప్రసవాలు జరిగిన కూడా తల్లి బిడ్డతో పాటు ఇతర రోగులు ఉండలేని దయనీయ పరిస్థితిలో సుండుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొంది. అయితే 2024 ఎన్నికలల్లో అవే హామీలు గుప్పించి జనాల ఓట్లు దండుకునే ప్రయత్నం చేశారు తప్ప ఇంకేమీ లేదని మండల ప్రజలు బహిర్గతంగా మాట్లాడు కుంటున్నారు.30 పడకల ఆసుపత్రి మంజూరు అయి పూర్తి అయితే మారుమూల మండలంలోని నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సరైన వైద్యం అందక అనేకమంది ప్రాణాలు కోల్పో వాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. అత్యవసర సేవలు అవసరమైతే ఇక్కడి నుండి కడప,తిరుపతి, తమిళనాడు, బెంగళూరు, వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే లోపు రోగులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి, గర్భవతులకు ప్రసవం చేయించా లన్న కనీస వసతులు కూడా లేకపోవడం దౌర్భాగ్యం అని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పటికైనా 30 పడకల ఆసుపత్రిగా సుండుపల్లి ప్రాథమిక వైద్య కేంద్రానికి శంకుస్థాపన చేయాలని మండల ప్రజలు కోరుతున్నా రు.వసతులు కూడా లేవు.మండల నలుమూలల నుండి రోగులు వస్తారు,నిత్యం రద్దీగా ఉంటుంది,30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తే మండల ప్రజలందరికీ మెరుగైన వైద్యం 24/7 అందుతుంది.

ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం :తహశీల్దారు

విశాలాంధ్ర - రాయచోటి : ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన ఆర్జీల పరిష్కారంలో అశ్రద్ధ చూపరాదని తహశీల్దార్ ఆర్ శివరాముడు సిబ్బందిని ఆదేశిం చారు. సోమవారం రైల్వేకోడూరు తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి వచ్చిన ఆర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆర్జీలపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆర్జీ దారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. సకాలంలో పరిష్కరించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆర్ఐ రాజశేఖర్, సర్వేయర్ కర్నాటి సుదర్శన్, సీనియర్ అసిస్టెంట్ మల్లిఖార్జున రెడ్డి, విఆర్ ఓ లు నిరంజన్, చాన్ భాష, రఘుపతి, ఆరవ వెంకటయ్య, శ్రీనివాసులు, భారతి, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు ప్రజాసమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించి అన్ని విధాల ఆదుకోవాలని ప్రకృతి వ్యవసాయ కాంట్రాక్టు ఉద్యోగులు మాస్టర్ ట్రైనర్ లు కృష్ణారెడ్డి, గంగిరెడ్డి సునీల్ కుమార్ ప్రతాప్ కమిటీ మెంబర్స్ డిమాండ్ చేశారు.తమ సమస్యల పట్ల వహిస్తున్న నిర్లక్ష్యంపై ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు సీఐటీయూ అనుబంధమైన ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ర్యాలీ, నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ తమ పట్ల అధికారులు, ప్రభు త్వం నిర్లక్ష్యంగా వ్యవహారించడం ఏమాత్రం తగదన్నారు. గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వంలో 17 నెలలుగా తమకు గౌరవ వేతనం ఇవ్వకపోవడం ఏమాత్రం సమంజ సం కాదన్నారు. గ్రామీణ స్థాయిలో పనిచేసే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంద న్నారు. ముఖ్యంగా తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెల వేతనం సక్రమంగా అందేలా చూ డాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఇప్ప టికైనా ప్రభుత్వం తమ పట్ల మానవతా హృద యంతో స్పందించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు తోపాటు ఇతర ఉద్యోగులు, సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

కువైట్ సెల్ఫీ వీడియో కథనానికి స్పందించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్

విశాలాంధ్ర- రాయచోటి : అపద, కష్టం వచ్చిం దంటే చాలు, సమాచారం అందిన క్షణం ఆలస్యం లేకుండా నేను ఉన్నాను అంటు అక్కడికి చేరుకొని వారికీ ఆపన్నా హస్తాం అందించే నాయకుడు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి. అందుకే ఆయ నకు మంచి మనసున్న మా రాజు అంటారు. ఈ నేపథ్యంలో వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామం బీసీ కాలనీలో నివసించే శివ బతుకు తెరువు కోసం కోయిట్ వెళ్లి నానా ఇబ్బందులు పడుతున్న సెల్ఫీ వీడియో చూసి చలించారు. ఈ మేరకు స్పందించిన పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి. టీడీపీ గ్రామ సర్పంచ్ మహిత శేషాద్రి రెడ్డి, టిడిపి నాయకులంతా కలిసి వారి ఇంటి దగ్గర వెళ్లారు. శివ భార్య పిల్లలను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. వారికి నిత్యావసర వస్తువులు అందజేశారు. బాధితుడు శివను తన గ్రామానికి రప్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శాసనసభ్యులు కిషోర్ కుమార్ రెడ్డి బాధితుడు శివ స్వగ్రామానికి చేరుకొని ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి తగిన ఆర్థిక సాయం చేస్తూ, ప్రభుత్వం అన్నివిధాలుగా అదుకొంటానని హామీ ఇస్తారని తెలిపారు.

వైసీపీకి రాజీనామా చేసిన హుమయూన్, సోదరులు

విశాలాంధ్ర-రాయచోటి : వైకాపా రాష్ట్ర కార్యదర్శి, మాజీ సర్పంచ్ హుమయున్ వారి సోద రులు,కొన్ని కారణాల వల్ల వైకాపా పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా పత్రాన్ని తాడేపల్లిగూడెం వైకాపా పార్టీ ప్రధాన కార్యాలయాన్ని పంపినట్లు తెలిపారు. తమ తండ్రి స్వర్గీయ షుకూర్ సాహెబ్ (మాజీ సర్పంచ్) గత 45 సంవత్సరాల నుంచి తమ కుటుంబం రాజకీయంలో ఉంటు తాము పీలేరు ప్రజలకు అనేక సేవలు చేస్తు పీలేరు పంచాయతీ అభిరుద్ది చేశామని తెలిపారు. వైఎస్ఆర్సిపి క్రియాశీల సభ్యత్వానికి పీలేరు మాజీ సర్పంచ్ ఏఎస్ హుమయూన్, సోదరులు రాజీనామా చేశారు. హుమయూన్ వైకాపా రాష్ట్ర కార్యదర్శి పదవికి, షాజహాన్ మండల పార్టీ ఉపాధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వాలకు కూడా రాజీనామాలు సమర్పించారు. అలాగే అతని మిగిలిన మరో ఇద్దరు సోదరులైన సలీం, జహం గీర్ కూడా పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. సోమవారం స్థానిక షుకూర్ ప్యాలెస్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులు, మిత్రులు, హితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల సూచనలు, సలహాల మేరకు తాము ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ హుమయూన్ మాట్లాడుతూ 1960 నుంచి తమ కుటుంబం ప్రత్యక్ష రాజకీయాల్లో ఉందని అన్నారు. తన తండ్రి షుకూర్ సాహెబ్ మూడుసార్లు, తాను రెండుసార్లు పీలేరు మేజర్ గ్రామపంచాయతీకి సర్పంచ్‌లుగా ఎన్నికై పంచాయతీ అభివృద్ధికి పాటు పడ్డంతో పాటు పట్టణ ప్రజలకు ఎఎన్నో సేవలు అందించి, నేటికీ పట్టణ ప్రజలకు తల్లో నాలుకలా తాము, తమ కుటుంబం వ్యవహరిస్తోందన్నారు. ఇదే ఒరవడిని ఇక ముందు కూడా కొనసాగిస్తూ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. ఆప్తుల సలహా మేరకు తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. తమ రాజీనామా పత్రాలను వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి పంపినట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ హుమాయూన్ తో పాటు ఆయన సోదరులు సలీం, షాజహాన్, జహంగీర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనానికి శుభ్రత ముఖ్యం-హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య

విశాలాంధ్ర -రాయచోటి : అతి ముఖ్యమైన సమయాల్లో చేతులను శుభ్రముగా సబ్బుతో కడుక్కోవడం అంటే,అంటు వ్యాధులు రాకుండా నిలువరించే టీకా వేసుకోవడం లాంటిదని,శుభ్రత ప్రాముఖ్యత గుర్చి హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య వివరించారు. సోమవారం పీలేరు పట్టణ మహిళ సమాఖ్య భవనంలో సమావేశమైన వి ఓ లీడర్స్ కు "అధిక వర్షాల - ఆరోగ్య నియమాలు" అంశముపై అవగాహన, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. పరిశుభ్రమైన నీరు,గాలి, ఆహారం, పరిసరాలు,మన ఆరోగ్యకర జీవనానికి ఎంతో అవసరమన్నారు. లేనిచో నీళ్లవిరేచనాలు,టైఫాయిడ్,పచ్చకామెర్లు,జిగటవిరేచనాలు,పోలియో,మొదలగు అంటువ్యాదులు సోకే ప్రమాదం వుందన్నారు. నీటిని కాచి వడగట్టి చల్లార్చిన నీటిని,లేదా శాస్త్రీయ పద్దతిలో క్లోరినేషన్ విధానములో శుద్ధి చేసిన నీటిని గాని త్రాగాలి, తాజా ఆహారం భుజించాలని ,ఈగలు వాలిన పదార్థాలు తినరాదని సూచించారు. తినే ప్రతిసారి సబ్బుతో చేతులు రుద్ది కడగాలని, పరిసరాలు,వ్యక్తిగత శుభ్రత విధిగా పాటించాలని కొండయ్య లీడేర్స్‌కి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపి ఓ లక్ష్మణారెడ్డి, ఏయన్ యం విజయకుమారి,సిహెచ్ ఓ అయేషా,ఆశా కార్యకర్తలు వి ఓ లీడర్స్ పాల్గొన్నారు.

ఆట - పాట" శ్రమ సంస్కృతి ఆవిష్కరణ

బాస్ నిర్వహించిన కళాభిషేకంలో జానపద అకాడమీ చైర్మన్ శివప్రసాద్

శివప్రసాద్‌ను ఘనంగా సన్మానించిన కళాకారులు

విశాలాంధ్ర-మదనపల్లి : కర్ణాటక జానపద అకాడమీ చైర్మన్‌గా నియమితులైన, ప్రజా గాయకుడు గొల్లహల్లి శివప్రసాద్ ను కళాభిషేకం పేరుతో భారతీయ అంబేడ్కర్ సేన బాస్ ఘనంగా సన్మానించింది. స్థానిక ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బాస్ వ్యవస్థాపకుడు పి.టి.యం. శివప్రసాద్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ తోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రజా కళాకా రులు హాజరై, ఆట, పాటలతో గొల్లహల్లి శివప్రసాద్‌కు 'కళాబి, షేకం' చేశారు. ఈసందర్భంగా పి.టి.యం. శివప్రసాద్ తోపాటు దళిత సంఘర్షణ సమితి డిఎస్ఎస్ కర్ణాటక రాష్ట్ర అగ్రనేతలు ఎన్. వెంకటేష్, ఎన్.మునుస్వామి,ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, ప్రముఖ గాయకుడు బురుజు లక్ష్మీనారాయణ, తెలుగు కోకిల భూదేవి, మోటివేనల్ స్పీకర్ రామ్మూర్తి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు మునివెంకటప్ప, అంజనప్ప తదితరులు గొల్లహల్లి శివప్రసాద్‌కు గజమాల వేసి, శాలువలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశయించి వీరు మాట్లాడుతూ గొల్లహల్లి శివప్రసాద్ నాలుగు దశాబ్దాలుగా దళిత సంఘర్షణ సమితి (డిఎస్ఎస్) సాంస్కృతిక సారధిగా, పాటై - ఆటై అవిశ్రాంతంగా ప్రజల కోసం గానం చేస్తున్నారని, గ్రామీణ జానపద కళలపై పరిశోధనలు చేస్తూ వాటి పునరుద్దరణ కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. ఆయన సేవలను గుర్తించి కర్ణాటక జానపద అకాడమీ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం పట్ల కర్ణాటక ప్రభుత్వానికి వీరు కృతజ్ఞతలు తెలియజేశారు. జానపద కళల పునరుద్దరణ కోసం శివప్రసాద్ శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. కొత్త పంథాలో జానపద అకాడమీ సేవలను విస్తృతం చేసి, ప్రజా ఉద్యమాలకు అండగా నిలవాలని సూచించారు. అనంతరం జానపద అకాడమీ చైర్మన్ శివప్రసాద్ మాట్లాడుతూ మన ఆదిమ సంస్కృతిలో శ్రమ శక్తుల చమట చుక్కల నుండి ఉద్భవించిన అద్భుతమైన ఆవిష్కరణ ఆట - పాట అని చెప్పారు. జానపద ప్రజా కళల అభివృద్ధికి అలుపెరుగని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను ఘనంగా సత్కరించిన బాస్ ప్రతినిధులకు, కళాకారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో బాస్ నాయకులు యు. గణపతి, కె.వి. రమణ, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సి.చంద్రయ్య, నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, సొన్నికంటి రెడ్డెప్ప, పాలకుంట శ్రీనివాసులు, సద్దల శశిధర్, ముత్యాల మోహన్, తలారి కృష్ణ, యోగేంద్ర, ప్రముఖ కళాకారులు కేవీ రత్నం, మునిరెడ్డి, మద్దెల మల్లికార్జున, గిరిజ, వేమనారాయణ, ఆనంద్ తదితరులతోపాటు బాస్, కర్ణాటక డిఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బిటీ కాలేజ్ బోధనేతర సిబ్బందికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర -మదనపల్లి : మదనపల్లె బిటీ కాలేజ్‌లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి వెల్ విషర్స్ సభ్యుడు ఆర్థిక సాయం అందించాడు. కృష్ణప్ప, కమలమ్మ, నాగరాజ, అరుణ, లక్ష్మినారాయణ, శకుం తల స్థానిక బీటీ కాలేజ్‌లో 2012 నుంచి బోధనేతర సిబ్బందిగా పని చేస్తు న్నారు. 2019 నుంచి జీత భత్యాలు లేకపోయినా కాలేజ్ నమ్ము కుని పని చేస్తున్నారు. ఇటీవల వీరితో పాటు పనిచేసే మరికొంత మంది బోధనేతర సిబ్బంది మాజీ కరస్పాండెంట్ ద్వారా మంత్రి లోకేష్‌ను కలిసి సమస్యను పరిష్కరించుకున్నారు. ఉద్దేశ పూర్వకంగా ఆ మాజీ కరస్పాండెంట్ ఆరుగురు పేర్లు లిస్ట్ లేకుండా తొలగించి మోసం చేశాడు. దీంతో వీరి పరిస్థితి దుర్భరంగా మారింది. సమస్య ను తెలుసుకున్న వెల్ విషర్స్ సభ్యుడు దేవరాజ కిరణ్ లండన్‌లో ఉన్న స్నేహితుడు బెజవాడ బాలజి దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన అతను ఆరుగురు వెళ్లి మంత్రిని కలిసేందుకు తనవంతుగా ఆరువేలు అందజేశారు. మరింత మంది వీరికి సాయం చేయాలని వెల్ విషర్స్ నిర్వాహకులు గిరీష్ కోరుతున్నారు.

దారి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి

విశాలాంధ్ర - రామసముద్రం : తమ పొలాలకు దారి సమస్య పరిష్కరించాలని సోమవారం రామసముద్రం తహసిల్దార్ శ్రీనివాసులకు మండలంలోని అరికెల పంచాయితీ నాగనపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేసుకున్నారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రామం నుండి పంట పొలాలకు వెళ్లి సాగు చేసుకునేందుకు చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నామని తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లారు వెంటనే స్పందించి తాసిల్దార్ ఆర్ ఐ నాగరాజుకు సమస్త పరిష్కరించాలని సూచించారు.

ప్రజలకు పారదర్శకమైన సేవలు అందివ్వాలి

సచివాలయ సిబ్బందికి ఎమ్మెల్యే ఆదేశం

విశాలాంధ్ర-మదనపల్లి : సచివాలయ సిబ్బంది ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. సోమవారం స్థానిక కోళ్లబైలు పంచాయతీలో ఎన్టిఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్, కోళ్లబైలు - 2 సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక టిడీపి నాయకులు రాటకొండ శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే హాజరుకాగా శ్రీనివాసులు నాయుడుతో పాటు బొమ్మిశెట్టి పురుషోత్తం, రెడ్డి రాయల్, మోహన్ రెడ్డిల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయం మరియు విలేజ్ హెల్త్ క్లినికులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశించారు. అంతే కాకుండా అవినీతి రహితంగా, పారదర్శకంగా సేవలను అందిస్తూ ప్రజలకు మరింత దగ్గర కావాలన్నారు. గత ప్రభుత్వం సచివాలయాలను కేవలం ప్రభుత్వ భూములు కబ్జా చేయడం కోసం వాటి వివరాలు రాబట్టుకోవడానికి పరిమితమయ్యాయని ఆరోపించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న సిబ్బంది మొత్తం కార్యాలయ ప్రాంగణం మొత్తం 150 మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గంగారపు రామ్మూర్తి నాయుడు, యర్రబల్లి వెంకటరమణా రెడ్డి, నాగూర్ వలి, తమ్మిశెట్టి రామకృష్ణ, చలపతి, కంచర్ల మల్లికార్జున నాయుడు, జెసిబి మధుసూదన్ రెడ్డి, రమేష్, చంద్ర మోహన్, సురేష్, జీవి నాయుడు, పెంచుపాడు స్వామి, జేసిబి వేణు, శివాజీ రాయల్, టిడిపి నాయకులు, , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీ -ఇరువురు మృతి

విశాలాంధ్ర-రాయచోటి : మండలంలోని కలిచర్ల పంచాయతీ బాటవారిపల్లి లో ఉండే రెడ్డెప్ప కుమారుడు సాయి(20) సివమ్మా కుమారుడు మోహన (17) వయసు ఇద్దరు రోడ్ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసి గ్రామంలో విశాద ఛాయలు అలుముకున్నాయి. బతుకు దెరువు కోసంబెంగుళూరు కు పోవ డానికి గ్రామనుంచి బయలు దేరి మదనపల్లి దగ్గర బెంగుళూరు రోడ్ లో బేగులూరు నుంచి అమరావతి వెళ్తున్న ఏపిఎస్ ఆర్టీసీ బస్ ను ఢీ కొట్టడంతో ఇద్దరు అక్కడికి అక్కడే మృతి చెందారు. ఈ విషయం గ్రామం లో తెలియడం తో ఇద్దరు ఒకే ఊరికి చెందిన వారు కావడంతో గ్రామం అంత వీసాదాపు ఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన వారిని పోస్ట్ మార్టం నిమిత్తమ్ మదన పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘోర రోడ్డు ప్రమాదం..ఇద్దరు యువకులు దుర్మరణం

విశాలాంధ్ర-మదనపల్లె:- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లె రూరల్ పరిధిలోని మదనపల్లె -బెంగళూర్ జాతీయ రహదారి చీకిలబైలు చెక్ పోస్ట్ సరిహద్దులో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.... అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం పెద్దమండ్యం మండలం కలిచెర్ల గ్రామ పంచాయతీ బటవారిపల్లి కి చెందిన ఎర్రగొల్ల వెంకటరమణ శివమ్మ దంపతుల కుమారుడు మోహన, అదే గ్రామానికి చెందిన ఎర్రగోల్ల రెడ్డప్ప కుమారుడు సాయికుమార్ లు బెంగళూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా మదనపల్లె -బెంగళూర్ జాతీయ రహదారి చీకిలబైలు చెక్ పోస్ట్ సరిహద్దులో ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న మదనపల్లి తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

సర్వసభ సమావేశానికి పలు శాఖ అధికారులు గైర్హాజరు

విశాలాంధ్ర-రాయచోటి : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ అధ్యక్షతన మండల సర్వసమా సమావేశం సోమ వారం నిర్వహించారు. అజెండాలోని పలు అంశాలపై చర్చించారు. ఎంపీటీసీ ప్రసాద్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అభివృద్ధి చేయడంలో విఫలం అయిందని సభా దృష్టికి తెచ్చారు. జడ్పిటిసి సమీన్ మాట్లాడుతూ అనేక అభివృద్ధి పనులతో మండలం దూసుకు వెళ్లిందని తెలిపారు ఎస్సై నాగార్జున రెడ్డి కలుగజేసెదని సభను సజావుగా జరగాలని నాయకులకు తెలిపారు అనంతరం అధికారులు అజంగాలోని వాళ్ళ అంశాలను సభా దృష్టికి తీసుకు వచ్చారు.. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్ణాకర్, ఎంపిటీసీ రాజగోపాల్, కదిరుల్ల సర్పంచ్ రావెనక్ ప్రత్యేక ప్రత్యేక ఆహ్వానితుడు రమణ,, ఎంపిడీవో ఎస్సై నాగార్జున రెడ్డి అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీటీ కళాశాలను ప్రగతి పథంలో నడిపించండి

ప్రిన్సిపాల్ కి ఎమ్మెల్యే షాజహాన్ బాషా సూచన

విశాలాంధ్ర-మదనపల్లి: చారిత్రాత్మక బి.టి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెంటనే ఆయన స్థానిక శాసనసభ్యులు షాజహాన్ బాషాని కలిసి కళాశాల అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలు గురించి చర్చించారు. కళాశాల ప్రగతికి ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని శాసనసభ్యులు షాజహాన్ భాషా హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ పి.బాబు కళాశాలలోని ప్రతి డిపార్ట్మెంటును సందర్శించి సూచనలిచ్చారు. కళాశాలకు చెందిన అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ బీటీ కళాశాలలో ఉన్న సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరిస్తామని,ఇకముందు ఇక్కడ ఎలాంటి సమస్యలు ఉండవని అందువలన విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి సందేహాలు పెట్టుకోకుండా తమ బిడ్డలను బీటీ కళాశాలలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ షాక్ తో యువకుడి మృతి

విశాలాంధ్ర - బద్వేలు : గోపవరం మండలం ప్రాజెక్టు కాలనీ 2 లో ఇంటిలో విద్యుత్ మరమ్మత్తులు చేసుకుంటూ ఉన్న నేపథ్యంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మన్యం అశోక్ 29 సంవత్సరాలు మృతి మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఒక మగపిల్లాడు కుటుంబ పెద్ద మృతి చెందడంతో దిక్కుతోచని స్థితిలో కుటుంబ సభ్యులు గ్రామంలో అందరితో మంచిగా ఉండే వ్యక్తి మృతి చెందడంతోగ్రామంలో విషాదఛాయలు ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

షరభత్, పానకం పంపిణీ

(విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరం 28వ డివిజన్ హబీబుల్లా వీధిలో పీర్ల పండగ సంద ర్భంగా టిడిపి నాయకులు అల్లా బకాష్ ఆధ్వర్యంలో షర్బత్, పానకం సోమవారం పంపిణీ చేయడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ టిడిపి నాయకులు మాజీ డిప్యూటీ మేయర్ ఆరిఫుల్లా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఎస్ అమీర్ బాబు రాష్ట్ర టిడిపి నాయకులు గోవర్దన్ రెడ్డి, నగర అధ్యక్షులు సానుపురెడ్డి శివకొండ రెడ్డి,లు పాల్గొని మాట్లాడుతూ. మొహరం పీర్ల పండుగ సందర్భంగా భక్తులకు ప్రజలకు పానకం పంపిణీలు మాట్లాడుతూ ప్రతి ఏడాది మొహరం పీర్ల పండుగ సందర్భముగా పాతియా చేసిన అనంతరము పానకము పంపిణీ చేయడం జరుగుతుందని కుల మతాలకు అతీతంగా నిర్వహించుకునే పండుగని అంతేకాకుండా అనేకమంది భక్తిశ్రద్ధతో మంచి జరగాలని ముక్కులను కోరుకొని చిన్నారుల నుండి పెద్దవాళ్ల వరకు మొహరం పండుగ సందర్భంగా అందరికీ మంచి జరగాలని ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి జల తోటి జయకుమార్ మైనారిటీ సెల్ యువ నాయకులు బి అబ్దుల్లా రాయల్ కరిముల్లా సంధా నరేంద్ర కుమార్ లాయర్ వేణుగోపాల్ రవి క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో బాధితుని పరామర్శించిన మందకృష్ణ మాదిగ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఒంటిమిట్ట మండలం పెన్న పేరూరు గ్రామానికి చెందిన మాల సామాజిక వర్గానికి చెందిన కదిరి ప్రసాద్ అరుగు మీద కూర్చున్నారని అనే నేపంతో కుల అహంకారంతో కొట్టి వేడివేడి నూనే ను మీద పోసినా గజ్జల వెంకటసుబ్బారెడ్డిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ కడప జిల్లా అధ్యక్షులు ఎం.వెంకటేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కె.మాతయ్య బాబు మాదిగ లు తెలిపారు. సోమవారం రిమ్స్ ఆర్ ఎం ఓ తో మాట్లాడి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు.ఈ విషయాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకుపోగా బాధితుడు కదిరి ప్రసాద్ తో ఫోన్లో మాట్లాడుతూ ఏమి జరిగిందని విషయంపై ఆరా తీస్తూ బాధితునికి ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని మీరు భయపడవద్దు నేను ఈనెల 17వ తారీకు కడపకు వస్తున్నాను.మీకు అండగా నిలబడి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్ మాదిగ, శివరాం మాదిగ, సుబ్బరాయుడు మాదిగ పాల్గొన్నారు.

22న డిగ్రీ విద్యార్థులకు వైవా-వోస్ పరీక్ష

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అను బంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు వైవా- వోస్ నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొ. ఎన్. ఈశ్వర రెడ్డి తెలిపారు. లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ ఫీజు చెల్లించిన విద్యార్థులు వైవావోస్‌కు కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు లాంగ్ టర్మ్ ఇంటర్ షిప్ ప్రాజెక్ట్ రికార్డు హార్డ్ కాపీని సమర్పిం చాలన్నారు. అందించాలని కోరారు.

ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి మృతి

విశాలాంధ్ర-మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి మృతి చెందినట్లు తాలూకా ఎస్సై రవికుమార్ తెలిపారు. మదనపల్లె బిసిని కొండలో ఆదివారం రాత్రి కారుఢీకొని చౌడేపల్లికి చెందిన ఆదర్శసాయి(21), అతని స్నేహితుడు గురప్ప (21)లు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహ నంలో మదనపల్లె నుండి చౌడేపల్లికి వెళుతుండగా నిమ్మనపల్లె రోడ్డు సర్కిల్లో కారు ఢీకొంది. ఈ ప్రమాదం లో ఇద్దరు కోమాలోకి వెళ్లారు. వారికి మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో చికిత్స చేయించి రుయాకు తరలించారు. అక్కడ విద్యార్థి ఆదర్శసాయి మృతి చెందడంతో మదనపల్లె ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కుమారుడి మృతి తో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కేసు దర్యాప్తు లో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

కౌలురైతుల గ్రామసభలు

విశాలాంధ్ర -అనంతసాగరం : అనంతసాగరం మండలంలోని రేవూరు, మినగల్లు గ్రామాలలోని సోమవారం రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి పంటసాగుల హక్కు పత్రాలు ద్వారా రైతులు ప్రయోజనాల పొందవచ్చని అగ్రికల్చర్ అసిస్టెంట్లు అవగాహన కల్పించారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు వెంకటేశ్వర్లు, లక్ష్మీ, కౌలు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం-డిప్యూటీ సీఎం ఫోటోలు ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిఎంపిడీవో

విశాలాంధ్ర -అనంతసాగరం : అనంతసాగరం మండలంలోని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఫోటోలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సోమవారం స్థానిక మండల ప్రజాఅభివృద్ధి అధికారి తాజ్ మస్రూర్ తెలిపారు. సీఎం, డిప్యూటీ సీఎం సచివాలయం లాగిన్ లో ఫోటోలను డౌన్లోడ్ చేసుకోవాలని ఉద్యోగస్తులను ఆయన తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో మొహరం జరుపుకోవాలి

విశాలాంధ్ర-ముద్దనూరు : ప్రశాంత వాతావరణం లో మొహరం జరుపుకోవాలని సిఐ దస్తగిరి ఒక ప్రకటనలో తెలిపారు, మండలం లోని మంగపట్నం లో రాబోవు మొహరం సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకొనవలెను అని ప్రజలకు తెలియజేశారు

ప్రతి రైడర్ హెల్మెట్ ధరించాలి: సీఐ

విశాలాంధ్ర-పులివెందుల: ప్రత రైడర్ హెల్మెట్ ధరించాలన ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణ పరిధిలోని నలంద కళాశాలలో సోమవారం హెల్మెట్ వినియోగంపై ఆ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైకు రైడర్లు, పిల్లాన్ రైడర్లు హెల్మెట్ పెట్టుకోక పోవడము వల్ల అలాగే కారు డ్రైవర్లు షీట్ బెల్ట్ పెట్టుకోక పోవడము వల్ల ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతు న్నారన్నా రు. చాలామంది తక్కువ దూరమే కదా అని హెల్మెట్ వున్నా కూడా పెట్టుకోకుండా నిర్లక్ష్య ము చేస్తుంటా రని అలా చేయకుండా ఇంటి నుండి బయటకు వెళితే హెల్మెట్ ధరిం చుట అలవాటు చేసుకోవాలని తెలిపారు. అదేవిధ ముగా మిగతా ట్రాఫిక్ నియమాలపై అవగా హన కల్పించి, ట్రిపుల్ రైడింగ్ నకు దూర ముగా వుండాలని తెలిపారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా చైతన్యము నింపుట కు ఈకార్య క్రమము చేపట్టడము జరిగినదని తెలిపారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే చంద్రబాబు కర్తవ్యం: ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: ఆంధ్ర ప్రదేశ్ ను ఆరోగ్య ఆంధ్రప్రదే శ్‌గా తీర్చిది ద్దడమే ముఖ్య మంత్రి చంద్రబాబు కర్తవ్య మని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ గోపాల్‌రెడ్డి వెల్లడించారు. స్థానిక వైఎస్సార్ సర్వజన వైద్య శాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భం గా రోగులకు అందుతున్న వసతులు, సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యవిధానాలపై ఆయన సిబ్బందితో సమావేవమయ్యారు. ఆసుపత్రిలో అందిం చాల్సిన వైద్య సేవల గురించి రామ గోపాల్‌రెడ్డి సిబ్బందికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలతో పాటు వైద్యరంగాన్ని కూడా అభివృద్ధి చేయడం కోసం చంద్రబాబు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుం దన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న చంద్రబాబు ఆకాంక్షను నెరవేరుస్తామన్నారు. ఆయన కలల సాకారం చేయడం కోసం తాము కూడా అంకితభావంతో కృషి చేస్తామన్నారు. ఆసుపత్రిలో అటు వైద్యులు, సిబ్బంది ఇటు మందుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరిడెంట్ డాక్టర్ కేవీ విగ్నేశ్వర రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వినయ్, డాక్టర్ రమణయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్, డాక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలో పారిశు ద్ధ్య పనులపై సోమ వారం నాడు పుర పాలక కార్యాల యం నందు కమీష నర్, పారిశుద్ధ్య విభాగాల అధికా రులతో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సమీక్ష సమా వేశం నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన మురికి కాలు వలు యందు మురికి తీయుటకు కావలసిన అంచనాలను తయారు చేయాలని చెప్పడం జరిగింది. పారిశుధ్యానికి ఉప యోగించే వాహనాల పరిస్థితులను గురించి తెలుసుకు న్నారు. ఇంటింటి కసువు సేకరణ ఖచ్చితంగా జరగాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రధాన కాలు వలను ఆక్రమించిన ప్రాంతాలను పరిశీలించాలని కమీషన ర్‌ను ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఆదేశించారు. పట్టణంలో హెూటళ్లు, రెస్టారెంట్లలో అమ్మకం జరిగే ఆహారాల నాణ్యతపై ప్రతిరోజు చెక్ చేయాలని కోరారు.

సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలి: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: ఎన్డీయే ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రవేశపెట్టనున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పార్టీ ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రు 12,500 ఆర్థిక సహాయం చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొందని, తీరా అధికారంలోకి వచ్చాక రు 5000 కోతపెట్టి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రు 6000 కలుపుకొని మే మాసంలో రు7500లు, అక్టోబర్ లో రు 4000లు, జనవరిలో రు 2000లు 3 విడతలుగా 49 లక్షల మంది రైతులకు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. రైతు భరోసా పథకం బదులు తాము అధికారంలోకి వస్తె అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని, ప్రతి రైతుకు ఏటా రు 20,000లు ఆర్థిక సాయం చేస్తామని టిడిపి తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొందన్నారు. టిడిపి కూటమి అధికారం లోకి వచ్చి నెల దాటిందన్నారు. ఇంకా రు 20వేలు కాదు కదా 20 పైసలు కూడా సాయం అందలే దన్నారు. ఒక వైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమయిందని, ఏరువాక పౌర్ణమి కూడా అయిపోయింది.వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతు న్నాయన్నారు. ఆర్థిక సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారని ఇదే సమయంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉం దన్నారు. కాబట్టి వెంటనే చంద్ర బాబు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం క్రింద రు 20,000ల ఆర్థిక సాయం ప్రతి రైతు కు చేయాలన్నారు. రైలతో పాటు కౌలు రైతులకు కూడా ఆర్థిక సాయం చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రు 6000 లతో ముడిపెట్టకూడదన్నారు. 2020 సెప్టెంబర్ 1 న జగన్ ప్రభుత్వం జీవో 22 జారీ చేసిందన్నారు. ఈ జీవో ప్రకారం వ్యవసాయ మోటర్లకు ప్రభుత్వం మీటర్లు బిగిస్తుందన్నా రు. శ్రీకాకు ళం జిల్లాలో ఇప్పటికే జగన్ ప్రభుత్వం బిగించిం దన్నారు. ఈ జీవో రైతు వ్యతిరేకం అని కాంగ్రెస్,వామపక్ష పార్టీలు, టిడిపి చెప్పాయన్నారు. మీటర్లు బిగిస్తే పగలగొట్టాం డి అని టిడిపి నాయకులు పిలుపు ఇచ్చారు.టిడిపి అధికారంలోకి వస్తే జీవో 22 రద్దు చేస్తామని వాగ్దానం చేసిందన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది.నెల దాటిపోయిం దన్నారు. విద్యుత్ రంగం పై శ్వేతపత్రం కూడా ప్రకటించిందన్నారు. జీవో 22 రద్దు ప్రస్తావన లేదని తెలిపారు. జీవో 22 ను చంద్ర బాబు ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే శ్రీకాకుళం జిల్లాలో బిగించిన మీటర్లను వెంటనే తొలగించాలన్నారు.

బోగస్ పింఛన్ల ఏరివేత ఎప్పుడో..?



విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లె మండలంలో బోగస్ ఎప్పుడనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. మండల పరిధి లో అడ్డదారుల ద్వారా సర్టిఫికెట్ పొంది వికలాంగుల పింఛన్ పొందుతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కడప రిమ్స్ ద్వారా అక్రమంగా సర్టిఫికెట్ పొంది తద్వారా పింఛన్ లబ్ధిపొందుతున్నారే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారపార్టీ నాయకుల అండదండలతో సుమారు రూ.20వేల దాకా ఖర్చు చేసి దొంగ సర్టిఫికెట్లు పొందారనే ఆరోపణలు గుప్పుమంటు న్నాయి. చెవుడు, వైకల్యం, మూగ ఇలా వివిధ రకాల లోపా లను చూపించి సర్టిఫికెట్‌లు పొందారనే చర్చ నడుస్తోంది. వీరందరూ చంద్రబాబు ప్రభుత్వంలో నెలకు రూ.6వేలు పింఛన్ సొమ్ము పొందుతున్నారు. అవయవాలు సక్రమంగా ఉన్నా పింఛన్ ఎలా ఇస్తారంటూ పలువరు ప్రశ్నిస్తున్నారు. ఈ తతంగం అంతా కడప రిమ్స్ ద్వారా జరిగిందే అనుమానాలు ఉన్నాయి. ఇలా అక్రంగా దొంగ సర్టిఫికెట్లు పొందడం వల్ల నిజరమైన వికలాంగులకు అన్యాయం జరుగుతోందని విశ్లేషకులు చెబుతు న్నారు. ఇలా మండల పరిధిలో వందలాది మంది లబ్ధిపొం తుతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తు న్నారు. గత ప్రభుత్వ హయాంలో వైకల్యం లేకున్నా వైద్యులకు చేతులు తడపటంతోనే ఈ వ్యవహార మంతా సాగిందనే వాదన బలంగా వినవస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వికలాంగుల పింఛన్‌పై ఆరా తీసినట్లు తెలిపింది. ఆ మేరకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కూడా ప్రారంభించాల్సి ఉంది. అయితే ఇంత వరకు ఆ ప్రక్రియ మొదలు కాలేదు. దీంతో ఇక తమ సర్టిఫికెట్లను ఎవరు వెరిపికేషన్ చేస్తారులే అన్న దీమాతో అక్రమ పింఛన్‌దారులు ఉన్నారు. పింఛన్ల వడబోత విధానం అమలేతే ఎంతో మంది అక్రమంగా పింఛన్ పొందుతున్న వారి బాగోతం బయటకు పొక్కే అవకాశం ఉందని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా బోగస్ పింఛన్లను ఏరివేసి అర్హులైన వారికి న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ ఇసుక మాకొద్దు బాబోయ్

ఉచిత ఇసుక అన్నారు..నాణ్యమైన ఇసుక ఎక్కడ?- ఇసుక వెయిటేజ్ తక్కువ వస్తుంది

విశాలాంధ్ర-సిద్ధవటం : సిద్ధవటం మండలం జ్యోతి గ్రామపంచాయతీలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక నాణ్యమైన ఇసుక అందిస్తామని ఉచితంగా ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం జ్యోతి ఇసుక క్వారీలో నాణ్యమైన ఇసుక లేదని లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక కాటా తక్కువ వస్తుందని కొనుగోలు దారులు కూడా ఎవరు ముందుకు రావడం లేదని ఈ ఇసుక మాకొద్దు బాబోయ్ అంటూ ఇసుక క్వారీలో వాహనాలను నిలుపుదల చేశారు. ఇసుక వ్యవహారంలో కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉందంటూ ఉచితం అంటూ దువ్వ ఇసుక లోడింగ్ చేయడం వల్ల టన్నేజీలు తక్కువ వస్తుందని ఇసుక రీచ్ లో సోమవారం డ్రైవర్లు తెలియజేశారు. మండల అధికారులు జిల్లా యంత్రాంగం తక్షణమే ఇసుక రీచ్ ను వేరే ప్రాంతానికి బదలాయించాలని మాకు ఇసుక వద్దంటూ ఆవేదన వ్యక్తం చేశారు. లోడింగ్ వెళ్లే రహదారి కూడా సరిగా లేదని వాహ నాలు దెబ్బ తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లారీకి ఇసుక,21 టన్నెజి అంటూ లోడింగ్ చేస్తున్నా రని కాటా వేస్తే చాలా తక్కువగా చూపిస్తుందని ఇసుక మాకొద్దు డ్రైవరు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లారీలకు జెసిబి యంత్రాలతో ఉన్నత అధికా రుల ఆదేశం ప్రకారం 21 బకెట్లు వేస్తున్నామని ఇసుక రీచ్ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 వరకు ఉంటుందని రాత్రి వేళల్లో కూడా ఇసుక రవాణా చేయాలని ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదని ఇసుక వాహన డ్రైవర్లు ఇసుక కాటా తక్కువ ఉందని చెప్తున్నారని ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం వాళ్ళు చెప్పిన ప్రకారం మాత్రమే ఇసుక పంపుతున్నామని ఆయన అన్నారు.

17న శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

విశాలాంధ్ర -రాయచోటి : రైల్వేకోడూ రు మండల కేంద్రంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల లో ఈ నెల 17 న బుధ వారం ఉద్యోగ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ ము త్యాల పెంచలయ్య సోమవారం పాత్రికే యులకు తెలిపా రు. ఆయన మాట్లాడుతూ బహుళ జాతీ య సంస్థ అయిన 24/7%ఖఊ% ఉద్యోగా లు భర్తీ చేసేందుకు మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ అద్వర్యం లో ఉద్యోగ మేళా జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.ఇటు వంటి అవకాశం మరోసారి లబించదన్నారు.

కలగానే మిగిలిన గ్రామ ఉద్యానవనము

విశాలాంధ్ర - కమలాపురం : ఈ చిత్రంలోని ఉద్యాన గ్రామ వనము (పార్క్) గత 2018 సంవత్సరంలోని తెలుగుదేశం ప్రభుత్వంలో కమలాపు రం గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు విశ్రాంతి ఉద్యోగులకు పట్టణంలోని చిన్నారులకు కార్యాలయం ఆవరణ సిబ్బంది మనశ్శాంతి కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ ఉద్యానవనము(పార్క్) నిర్మాణం చేపట్టారు పార్క్ అంచనా రూ. ఐదు లక్షలు అయినప్పటికీ గత టిడిపి ప్రభుత్వంలోగుప్తదారుడు బాబు ల్ రూ.ఐదు లక్షల తో పార్కు నిర్మా ణాన్ని చేపట్టినప్పటికీ ఆనాడు 20 18 లో గుప్తదారునికి రూ.96000 వేల రూపాయలు మాత్రమే గుప్తదారుడు అందినట్లు సమాచారం తిరిగి వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో కమలా పురం గ్రామ ఉద్యానవనము (పార్క్) విషయం గాని ఊసు గాని లేదు అయితే కమలాపురం నగర పంచాయ తీ కావడంతో గ్రామీణ ఉద్యానవనము పార్క్ కల కలగానే నిలిచిపోయింది ఆనాడు పంచాయతీ సెక్రటరీగా కమ లాపురం గ్రామపంచాయతీలో విధులు నిర్వహించిన అధికారుల పేరుతో బిల్లు మంజూరైనట్లు గుప్తదారుడు తెలిపారు.

అమ్మవారికి శాకంబరీ అలంకారం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణ నడి బొడ్డున గల శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో తొలి ఏకాదని వచ్చిన సంధర్భంగా ప్రాత: కాలము నుండి స్వామి వారికి రుద్రాభిషేకాలు, అమ్మ వారికి కుంకుమార్చనలు జరుగుతూ విశేశంగా అమ్మవారికి శాకాంబరీ (కూరగాయలతో) అలంకారము జరు గుతున్నదని కావున భక్తులు దర్శించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించి స్వామి, అమ్మవార్ల అనుగ్రహము పొందలగరని ఆలయ ఈఓ శంకర్ బాలాజి, చైర్మెన్ కొత్తమిద్దె రఘురాంరెడ్డి, పాలక మండలి సభ్యులు తెలిపారు.